సాక్షి ప్రకాశం

బుధవారం, 13, నవంబర్, 2024

జిల్లాలో 2.7 మి.మీ సరాసరి వర్షపాతం



ఒంగోలు అర్బన్: జిల్లాలో మంగళవారం ఆరు మండలాల్లో సరాసరి 2.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జరుగుమల్లి మండలంలో 22.4 మి.మీ నమోదు కాగా టంగుటూరు 22 మి.మీ, పొన్నలూరు 16.4, సింగరాయకొండ 16, ఒంగోలు 12.8, కొత్తపట్నం 9.2, పామూరు మండలంలో 2.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ ఆరు మండలాలు మినహా ఏ మండలంలోను వర్షం లేదు.

గరిష్టం/కనిష్టం
27/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఇది ముంచే ప్రభుత్వం

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం అంకెల గారడీతో డాబుసరి బడ్జెట్ ప్రవేశపెట్టిందని, ఇది మంచి ప్రభుత్వం కాదు ముంచే ప్రభుత్వమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మద్దిపాడు మండలం కూచిపూడికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల అభ్యున్నతికి ఉపయోగపడే ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారో చెప్పాలని మంత్రి స్వామిని ప్రశ్నించారు. సాంఘిక సంక్షేమం కోసం ఎంత నిధులు కావాలి, ఎంత కేటాయించారో చెప్పాలన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల కోసం వసతి దీవెన, విద్యా దీవెన కోసం త్రైమాసికంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారని గుర్తు చేశారు. ఐదు నెలల నుంచి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ప్రజలను నైరాశ్యంలోకి నెట్టి ఇప్పుడు అంకెల గారడీ బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రజలను ఏమారుస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేదోడు వంటి సంక్షేమ పథకాలు అందించి ప్రజలను ఆదుకున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి మరిచి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. అక్రమ కేసులపై హైకోర్టు చీవాట్లు పెట్టినా ప్రభుత్వ తీరు మారలేదన్నారు. కూటమి ప్రభుత్వం చేసే అక్రమ అరెస్టులు, అరాచకాలపై అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, బోద రమణారెడ్డి, మాకినేని వెంకట్రావు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి చేసిన ఉపాధ్యాయుడు అరెస్టు

టంగుటూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఆ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు వీరపనేని చెన్నకేశవులును మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఒంగోలులోని నెల్లూరు బస్టాండులో ఉన్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సింగరాయకొండ సీఐ హజరత్తయ్య తెలిపారు.

జాతీయ సివిల్ సర్వీసెస్ వాలీబాల్ పోటీలకు వెంకట్రావు


టంగుటూరు: జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ వాలీబాల్ పోటీలకు ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు ఎంపికయ్యారని పీడీ వెంకట్రావు మంగళవారం తెలిపారు. నవంబర్ 9 న కృష్ణాజిల్లా విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 2025 సంవత్సరం ఫిబ్రవరి 22, 23, 24 తేదీల్లో పూణేలో జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు నుంచి పాల్గొంటారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రధానోపాధ్యాయులని పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

పేదల బియ్యం
పచ్చని దోపిడీ..!

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు అందాల్సిన బియ్యాన్ని అధికార పార్టీ నేతలు పందికొక్కుల్లా బొక్కేస్తున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో రేషన్ బియ్యం పట్టుబడడమే ఇందుకు నిదర్శనం. పథకం ప్రకారం రేషన్ దుకాణాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆ తర్వాత బియ్యాన్ని అడ్డూ అదుపూలేకుండా నల్లబజారుకు తరలించేస్తున్నారు. జిల్లాలో ప్రతి రోజూ రాత్రయితే చాలు చీకటి మాటున టన్నులు కొద్దీ బియ్యాన్ని జిల్లాలు దాటిస్తున్నారు. పల్నాడు, నంద్యాల జిల్లాలకు పంపి పాలిష్ చేసి అక్కడ నుంచి నెల్లూరు జిల్లాలోని ఒక పోర్టు మీదుగా విదేశాలకు తరలిస్తున్నారు.

జిల్లాలో రేషన్ దుకాణాలు: 1392

రేషన్ కార్డుదారులు	పంపిణీ చేస్తున్న బియ్యం
6,76,160	9500 టన్నులు



- జిల్లాలో అడ్డూ ఆపు లేని బియ్యం మాఫియా
- నంద్యాల, పల్నాడు జిల్లాల్లో రీసైక్లింగ్
- దొడ్డిదారిన నెల్లూరు జిల్లాలోని పోర్టుకు
- తెలుగు తమ్ముళ్ల బొజ్జలు నింపుతున్న పీడీఎస్ బియ్యం
- పశ్చిమ ప్రకాశం కేంద్రంగా జోరుగా దందా
- నామమాత్రపు దాడులతో సరి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో 1392 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో వెయ్యి మందికి పైగా రేషన్‌డీలర్లను బలవంతంగా తప్పించి అధికార పార్టీ నేతల అనుచరులకు కట్టబెట్టారు. దీంతో వారు చెప్పిందే వేదంగా మారింది. ఒక్కో రేషన్ డీలర్ పరిధిలో కనీసం 500 కార్డులు ఉంటాయి. డీలర్లు బియ్యం విక్రయించడం సంగతి అటుంచి వారే వినియోగదారుల నుంచి బహిరంగంగా బియ్యాన్ని కొంటున్నారు. ఇందుకు సంబంధించి అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ప్రతీ గ్రామంలో 10 నుంచి 15 మందితో కూడిన దళారుల బృందం ఒకటి తయారైంది. కిలో బియ్యం పది నుంచి పదిహేను రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని 20 నుంచి 25 రూపాయల వరకు దళారికి అమ్ముకుంటారు. దళారుల చేతుల్లోంచి బడా వ్యాపారులు మొత్తం బియ్యాన్ని కొనుగోలు చేసి నంద్యాల, పల్నాడు జిల్లాలకు తరలించి రీ సైక్లింగ్ చేసి గోతాలు మార్చి కృష్ణపట్నం పోర్టు మీదుగా విదేశాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ తతంగమంతా అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లో జరుగుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ప్రజా ప్రతినిధులకు వాటాలు..

రేషన్ బియ్యం అక్రమ రవాణా కాసుల వర్షం కురిస్తోంది. అక్రమ రవాణా జరుగుతున్నప్పుడు పోలీసులు, విజిలెన్స్ అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకునే బాధ్యత ఆ నియోజకవర్గ ప్రజా ప్రతినిధిదే. సదరు ఎమ్మెల్యేకి ప్రతి నెలా పెద్ద మొత్తంలో ముట్టచెబుతుంటారని తెలుస్తోంది. కేవలం ఎమ్మెల్యేకే కాకుండా మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులకు వారి స్థాయిని బట్టి వాటాలు పోతుంటాయని సమాచారం. రేషన్ అక్రమ వ్యాపారం రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు కామధేనువులా, ఏటీఎంలా తయారైందని ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

అక్రమ రేషన్ ఖిల్లా పశ్చిమ ప్రకాశం

అక్రమ రేషన్ వ్యాపారానికి పశ్చిమ ప్రకాశం అడ్డాగా మారిందని ప్రచారం జరుగుతోంది. నిన్నా మొన్నటి వరకు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని నిర్వహించిన ఒక వ్యాపారి కోట్లకు పడగలెత్తినట్లు సమాచారం. ఇప్పుడు తెలుగు దేశం ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు ముఖ్య అనుచరులు ఈ అక్రమ వ్యాపారాన్ని చేజిక్కించుకొని ఆయనను పక్కకు తప్పించినట్లు వినికిడి. ఇటీవల త్రిపురాంతకం మండలంలో రేషన్ రవాణా విషయంలో తెలుగుదేశం పార్టీలోని రెండు గ్రూపుల మధ్య గొడవలు కూడా జరిగాయి. ఇక్కడే కాకుండా జిల్లాలో అనేక చోట్ల టీడీపీ నాయకుల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. ఆ మధ్య పెద్దారవీడు మండలంలోని దేవరాజు గట్టు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుపడిన రేషన్ బియ్యం పట్టుబడింది. తనిఖీలు నిర్వహించిన పోలీసులను అమానిగుడిపాడుకు చెందిన టీడీపీ నాయకుడు దుర్భాషలాడినట్లు ప్రచారం జరిగింది. ఆ తరువాత రంగప్రవేశం చేసిన ఎరిక్షన్ బాబు పోలీసుల ఆధీనంలో ఉన్న రేషన్ లారీని విడిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. యర్రగొండపాలెం మండలంలోని అమానిగుడిపాడు గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ షహదత్ వెంకట త్రివినాగ్ సినీఫక్కీలో లారీని వెంటాడి పట్టుకోవడం సంచలనం సృష్టించింది. రెవెన్యూ అధికారులు, పోలీసులతో కలిసి ఛేజ్ చేసిన సబ్ కలెక్టర్ కంభం మండలంలోని కందులాపురం వద్ద అర్ధరాత్రి లారీని అడ్డుకొని అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆ లారీలో 3 టన్నుల బియ్యం ఉన్నట్లు సమాచారం. ఈ బియ్యం కూడా ఎరిక్షన్ బాబు అనుచరులు తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతిపక్ష డీలర్లకు వేధింపులు:

భారీ మొత్తంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి రెవెన్యూ అధికారులు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు చెప్పిన రేషన్ డీలర్లను వేధించే పనిలో తలమునకలుగా ఉన్నారు. ఒంగోలులోని ఒక రేషన్ డీలర్‌ను రాజీనామా చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. అందుకు అతడు నిరాకరించాడు. దాంతో అతడిపై ఎలాగైనా సరే కేసులు పెట్టేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఉదయం లేచిందగ్గర్నుంచి ఆ డీలర్ దగ్గరకే వెళ్లి రకరకాల ప్రశ్నలతో వేధిస్తున్నట్లు సమాచారం. ఒకసారి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో ఫోన్ చేయించమని సదరు రెవెన్యూ అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నెలవారీ మామూళ్ల మత్తులో జోగుతున్న రెవెన్యూ అధికారులు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారుల వైపు కన్నెత్తి చూడడం లేదు.

పట్టుబడిన అక్రమ బియ్యం:

సంతనూతలపాడులోని నాగరాజు ట్రేడర్స్ రైస్ మిల్లుపై ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మశ్రీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఈ రైస్ మిల్లులో పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో సుమారు రూ.40 లక్షల విలువైన 80 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరుసటి రోజు 7వ తేదీ తెల్లవారుజామున తాళ్లూరు మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. బొద్దికూరపాడు గ్రామంలోని ఒక పెట్రోలు బంకులో నిల్వ చేసిన బియ్యాన్ని ఒక లారీలోకి లోడ్ చేసి రాజంపల్లికి వైపు వెళుతుండగా విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రూ.6.80 లక్షల విలువైన 368 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. యర్రగొండపాలెం మండలంలోని సాయిబాబా నగర్ వద్ద రీ సైక్లింగ్ చేస్తున్న 600 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. చీమకుర్తి మండలంలోని మంచికలపాడు గ్రామంలో రెండు నెలలుగా రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని సమాచారం. ప్రజలు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా తూ తూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి నామమాత్రంగా 6ఏ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

హడావుడి తప్ప కేటాయింపులేవీ..

- వెలుగొండ ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం
- రూ.4 వేల కోట్లు అవసరమైతే కేటాయించింది రూ.394 కోట్లే
- సొరంగ నిర్మాణాలు అనాథల్లా కనబడుతున్నాయని ఎద్దేవా
- సీపీఎం కేంద్ర కార్యవర్గ సభ్యుడు బి.వి రాఘవులు



సొరంగ నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఎం కేంద్ర కార్యవర్గ సభ్యుడు బీవీ రాఘవులు

పెద్దదోర్నాల: వెలుగొండ ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర మంత్రులు అప్పటికప్పుడు హడావుడి చేశారే తప్ప, నిధులు కేటాయించటంలో చిత్తశుద్ధి చూపించలేకపోయారని సీపీఎం కేంద్ర కార్యవర్గ సభ్యుడు బీవీ.రాఘవులు విమర్శించారు. కొత్తూరు వద్ద జరుగుతున్న సొరంగ నిర్మాణ పనులను సీపీఎం బృందంతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొద్ది రోజుల కిందట ముగ్గురు రాష్ట్ర మంత్రులు వెలుగొండ ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన విషయాన్ని ఆయన ఈ గుర్తు చేశారు. రెండు సొరంగ నిర్మాణాల ఎదుట నిలబడితే ఎవరికీ పట్టని అనాథల్లా అవి కనబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి దశ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.4 వేల కోట్లు అవసరమైతే, బడ్జెట్‌లో కేవలం రూ.394 కోట్లు కేటాయించారని విమర్శించారు. మంత్రులు వచ్చి ఇక్కడ హడావుడి చేయటం ఎందుకు..అక్కడికి వెళ్లి ముష్టి వేసినట్లు బడ్జెట్ కేటాయించటం ఎందుకని ప్రశ్నించారు. ఇది కేవలం ప్రజలను మోసగించేందుకేనని అన్నారు. నల్లమల సాగర్ రిజర్వాయర్, హెడ్ రెగ్యులేటర్ పనులు ఎప్పుడో పూర్తయ్యాయని, కేవలం కొద్దిగా లైనింగ్ పనులు పూర్తిచేసి మొదటి సొరంగం ద్వారా ఈ ప్రాంతానికి నీరందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాను గతంలో 2006లో ఈ ప్రాంతంలో పర్యటించానని తెలిపారు. ఇంతటి చిన్న ప్రాజెక్టు పూర్తి చేసేందుకు దాదాపు 30 సంవత్సరాలు పడుతుందా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.వేల కోట్లు కేటాయిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం కొద్ది పాటి బడ్జెట్‌ను కేటాయిస్తే వెలుగొండ వంటి ఓ మంచి ప్రాజెక్టును పూర్తి చేయ్యెచ్చనే ఆలోచనను ఈ ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జూన్ నాటికి పెండింగ్ పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తే తమతో కలిసి వచ్చే పార్టీలతో కలిసి ఉద్యమాలు కొనసాగిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ సెక్రటరీ సయ్యద్ హనీఫ్, జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.